క్లుప్తంగా

కోమటిరెడ్డిని కలిసిన ఏపూరి సోమన్న



హైదరాబాద్‌లో కోమటిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏపూరి సోమన్న

తిరుమలగిరి : మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు ఏపూరి సోమన్న సోమవారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రి వెంకట్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం సోమన్న మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. మూసీ ప్రక్షాళన వల్ల నియోజకవర్గంలోని ఎంతో మంది రైతులకు మేలు జరుగుతుందన్నారు. తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరారు.

కాళోజీ అవార్డు ప్రదానం



అవార్డు అందుకుంటున్న సత్యగౌడ్

మద్దిరాల : మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామానికి చెందిన కవి, రచయిత, ప్రముఖ సంఘ సేవకుడు తీగల సత్యగౌడ్‌కు కాళోజీ జాతీయ అవార్డు లభించింది. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో తెలుగు టెలివిజన్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు నగబాల సురేష్‌కుమార్ చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి సాధనాల వెంకటస్వామి నాయుడు, సినీ గేయ రచయిత మౌనశ్రీ మల్లిక్, ప్రేమ్‌రాజ్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయికి ఎంపిక



ఇందిర

సూర్యాపేటటౌన్ : అక్టోబర్ 7, 8వ తేదీల్లో మేడ్చల్‌లో నిర్వహించి న 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి చదరంగ పోటీల్లో త్రివేణి పాఠశాల విద్యార్థిని కప్పల ఇందిర ప్రతిభ కనబరిచి జాతీయస్థాయికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ హరి తెలిపారు. సోమవారం పాఠశాల ఆవరణలో విద్యార్థినిని, కోచ్ ఎడవెల్లి అనిల్‌ను అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈనెల 17 నుంచి 21 వరకు మధ్యప్రదేశ్‌లో జరిగే జాతీయస్థాయి చదరంగ పోటీల్లో ఆమె పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినికి రూ.15 వేల నగదు బహుమతితో పాటు 10వ తరగతి వరకు ఉచిత విద్యను అందిస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



గాయత్రి

సూర్యాపేటటౌన్ : మహబూబ్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఇటీవల జరిగిన బాస్కెట్ బాల్ పోటీలలో జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీ వెంకటసాయి ఒకేషనల్ కళాశాల విద్యార్థిని లావూడి గాయత్రి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు కళాశాల కరస్పాండెంట్ కారింగుల బాలగౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 19 విభాగంలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆమె ఆడనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థిని కరస్పాండెంట్‌తో పాటు ప్రిన్సిపల్ విజయలక్ష్మి, సిబ్బంది అభినందించారు.

విద్యార్థిని ఆచూకీ లభ్యం

పెన్‌పహాడ్ : దోసపహాడ్ శివారులో గల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల నుంచి ఆదివారం అదృశ్యమైన 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఆచూకీ లభించడంతో సోమవారం పోలీసులు ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విద్యార్థిని అదృశ్యమైన విషయాన్ని పాఠశాల ఉపాధ్యాయులు ఆమె తల్లిదండ్రులకు తెలియజేయడంతో వారు పాఠశాలకు చేరుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్టేషన్ ఇన్‌చార్జి యాదగిరి మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విద్యార్థిని ఆచూకీ లభించడంతో కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. గతంలోనూ ఇదే పాఠశాల నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమవ్వడంతో విద్యార్థినుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టిసారించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరుతున్నారు. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరేందుకు ఫోన్ చేయగా స్పందించలేదు.

డీటీఎఫ్ కమిటీ ఎన్నిక



ఆనంద్‌భాస్కర్

పెన్‌పహాడ్ : డీటీఎఫ్ మండల కమిటీని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం మండల సర్వసభ్య సమావేశంలో ఈ ఎన్నిక జరిపినట్లు రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దశరథరామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. అధ్యక్షుడిగా జి. ఆనంద్ భాస్కర్, ఉపాధ్యక్షులుగా ఎస్‌కే. ఖాసీం, పిచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఎస్‌కే. ఉమర్, కార్యదర్శులుగా సతీష్, విజయకుమారి, జిల్లా కౌన్సిలర్లుగా నరేందర్, జి. వెంకటేశ్వర్లు, ఆడిట్ కమిటీ కన్వీనర్లుగా గోవర్ధనాచారి, పి. వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు.

ముమ్మరంగా సమగ్ర కుటుంబ సర్వే



సూర్యాపేట : సర్వేను పరిశీలిస్తున్న డీఈ



అర్వపల్లి : సర్వేను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్



మద్దిరాల : సర్వేలో పాల్గొన్న తహసీల్దార్

సూర్యాపేట : పట్టణంలో జరుగుతున్న సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వేకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ డీఈ సత్యారావు అన్నారు. సోమవారం పట్టణంలోని 12, 13, 18వ వార్డుల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించి ఎన్యుమరేటర్లకు తగు సూచనలు ఇచ్చారు. ప్రజలు ఆధార్, రేషన్‌కార్డు, ధరణి పాస్ పుస్తకాలు అందుబాటులో ఉంచుకొని ఎన్యుమరేటర్లు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు ఎండీ గౌసుద్దీన్, ఎస్ఎస్ఆర్ ప్రసాద్, ఇ. మనోజ్‌కుమార్, వార్డు అధికారులు శ్వేత, సుజాత, నాగునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : సమగ్ర కుటుంబ సర్వేకు ప్రజలు సహకరించాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. సోమవారం మండల పరిధిలోని వివిధ గ్రామాలలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎన్యుమరేటర్లకు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాలునాయక్, జలంధర్‌రావు, ప్రసన్న, వెంకట్‌రెడ్డి, ఉపేందర్, హరిస్వరూప్, సైదిరెడ్డి, నగేష్, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను అన్ని గ్రామాల్లో ముమ్మరంగా నిర్వహిస్తున్నామని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. సోమవారం ముకుందాపురంలో తహసీల్దార్ అమీన్‌సింగ్, చందుపట్ల గ్రామంలో ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డిలు వేరువేరుగా సర్వేలో పాల్గొని ప్రజల నుంచి వివరాలను సేకరించారు. ఈ కార్యక్రమంలో ఎన్యుమరేటర్లు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు లేకుండా నమోదు చేయాలి

పెన్‌పహాడ్ : సమగ్ర కుటుంబ సర్వేలో ఎలాంటి తప్పిదాలకు అవకాశం లేకుండా ఎన్యుమరేటర్లు పనిచేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రసాద్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్యుమరేటర్లు అన్ని కుటుంబాల సమగ్ర సమాచారం సేకరించాలని సూచించారు. అనంతరం గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, డీపీఎం లక్ష్మీనారాయణ, ఏపీఎం అజయ్ నాయక్, ఏఈఓ మురళి, ఐకేపీ నిర్వాహకులు ధనలక్ష్మి, అన్నమేరి తదితరులు పాల్గొన్నారు.

నాగారం : సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల గణన సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. సోమవారం నాగారంబంగ్లా గ్రామంలో కుల గణన సర్వేను పరిశీలించి మాట్లాడారు. ఈ సర్వేలో 56 అంశాలు ఉంటాయని, సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి నమోదు చేయాలన్నారు. సర్వేలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, కార్యదర్శి శోభన్‌బాబు, ఎన్యుమరేటర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని తహసీల్దార్ ఎం. శ్రీనివాసరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంతోపాటు మండల పరిధిలోని గ్రామాల్లో సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గడువులోగా సర్వేను పూర్తి చేసేందుకు ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు ప్రణాళికబద్ధంగా వ్యవహరించాలన్నారు.

కుక్కలు, కోతులను నిర్మూలించాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సమాచార హక్కు వికాస సమితి సభ్యులు

నాగారం : గ్రామాల్లో, పట్టణాల్లో విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులు చేస్తూ భయాందోళనకు గురిచేస్తున్న వీధి కుక్కలు, కోతుల నివారణకు చర్యలు చేపట్టాలని కోరుతూ సోమవారం సూర్యాపేటలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు సమాచార హక్కు వికాస సమితి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సమాచార హక్కు వికాస సమితి జిల్లా అధ్యక్షుడు గుంటకండ్ల ముకుందారెడ్డి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లో, పట్టణ ప్రాంతాల్లో వీధి కుక్కలు, కోతులు విచ్చలవిడిగా సంచరిస్తూ నివాసాలు, పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలపై దాడి చేస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సమాచార హక్కు సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చేకూరి శివ, రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉన్నం సత్యనారాయణరావు, జిల్లా కార్యదర్శి కిన్నెర ఉపేందర్‌రావు, మలిగిరెడ్డి కృష్ణారెడ్డి, దండ వెంకటరెడ్డి, బంగారు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

భానుపురి : సీపీఐ ఏర్పడి 100 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా శతాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని పార్టీ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పట్టణ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ సమితి పిలుపులో భాగంగా సంవత్సర కాలం పాటు అన్ని గ్రామాల్లో ఎర్రజెండా ఎగురవేయాలన్నారు. కమ్యూనిస్టు పార్టీ పోరాట చరిత్రను భావితరాలకు తెలిసే విధంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. డిసెంబర్ 30న నల్లగొండలో జరిగే శత జయంతి ఉత్సవాల బహిరంగ సభకు సూర్యాపేట జిల్లా నుంచి అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు హాజరుకావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గుగులోతు రాజారామ్, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, పార్టీ సీనియర్ నాయకులు బొమ్మగాని శ్రీనివాస్, పార్టీ చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, పట్టణ కౌన్సిల్ సభ్యులు నిమ్మల ప్రభాకర్, రేగటి లింగయ్య, ఎడెల్లి శ్రీకాంత్, బూర సైదులు, కృష్ణ పాల్గొన్నారు.

కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : నూతన కమిటీలతో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సంస్థాగత ఎన్నికల ప్రక్రియ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి ఆదరణ రోజురోజుకూ పెరుగుతోందన్నారు. పట్టణంలోని 112 పోలింగ్ బూత్‌లలో నూతనంగా కమిటీలు ఏర్పాటు చేసేందుకు 16 శక్తి ఇన్‌చార్జ్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 20 నుంచి 25 వరకు బూత్ కమిటీలను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి..

తెలంగాణ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను అమలు చేయాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్ అన్నారు. సోమవారం చివ్వెంల మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో మాట్లాడారు. సన్నాలకు రూ.500 బోనస్ ఇచ్చి మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు పేర్వాల లక్ష్మణ్‌రావు, చల్లమల్ల నర్సింహా, ధరావతు శ్రీనివాస్ నాయక్, నెమ్మాది సురేష్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు నల్లబ్యాడ్జీలతో నిరసన

అర్వపల్లి : విధి నిర్వహణలో ఉన్న వికారాబాద్ కలెక్టర్ జైన్‌పై రైతుల పేరుతో కొంతమంది చేసిన దాడిని నిరసిస్తూ మంగళవారం అన్ని మండలాల్లో తెలంగాణ రికార్డుల అసిస్టెంట్‌ల సంఘం ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేయనున్నట్లు రికార్డు అసిస్టెంట్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి వీరన్న, ఎల్.నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కీడల్లోనూ శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న ఏఎస్పీ నాగేశ్వర్‌రావు

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలని అడిషనల్ ఎస్పీ నాగేశ్వరావు అన్నారు. సోమవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎస్‌జీఎం క్రికెట్ అకాడమీలో నిర్వహించిన నారాయణ ప్రీమియర్ లీగ్ నల్లగొండ జోన్, ఎన్‌పీఎల్ జోన్ లెవెల్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న ఫోన్లు అప్పగింత

తుంగతుర్తి : అపరిచిత వ్యక్తుల నుంచి సెల్‌ఫోన్‌లను కొనుగోలు చేయవద్దని తుంగతుర్తి సీఐ శ్రీను నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లను 8 మంది ఫిర్యాదుదారులకు అప్పగించి మాట్లాడారు. మండలానికి చెందిన పలువురు బాధితులు గతంలో తమ సెల్‌ఫోన్‌ను పోగొట్టుకున్నట్లు తుంగతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని అన్నారు. పోగొట్టుకున్న సెల్‌ఫోన్ వివరాలను సీఈఐఆర్ అప్లికేషన్ నందు నమోదు చేసి మొబైల్‌ను ట్రేస్ చేసి పట్టుకొని ఫిర్యాదుదారులకు అప్పగించినట్లు తెలిపారు. ఆయనతోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

టీయూటీఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా శ్రీనివాస్

తిరుమలగిరి : టీయూటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుమలగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఆదిలాబాద్‌లో జరిగిన టీయూటీఎఫ్ రాష్ట్ర సమావేశంలో ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

మౌలానా అబుల్ కలాం జీవితం ఆదర్శనీయం



మైనార్టీ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేస్తున్న ప్రిన్సిపల్

తుంగతుర్తి : భారతదేశం తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం ఆజాద్ జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఉమారెడ్డి అన్నారు. సోమవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో నిర్వహించిన జాతీయ విద్యా దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. అబుల్‌కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వివిధ క్రీడాపోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మత గురువు మౌలానా అబ్దుల్ అహద్, ఎండీ నజీరొద్దీన్, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాస్, అధ్యాపకులు రాంబాబు, రవి, లక్ష్మణ్, భాస్కర్, శ్యామలత, సిరాజ్, భాను, జరీనా, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు



సూర్యాపేట పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సూర్యాపేటటౌన్ : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డిలపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని పట్టణ పోలీస్ స్టేషన్‌లో సోమవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి వెంకట్ రెడ్డి వ్యాఖ్యలను ఖండించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై. వెంకటేశ్వర్లు, సూర్యాపేట పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు గౌడ్, కౌన్సిలర్లు తాహెర్ పాషా, మడిపెల్లి విక్రమ్, నాయకులు ఆకుల లవకుశ, బత్తుల జానీ యాదవ్, గండూరి కృపాకర్, బత్తుల రమేష్, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌లో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 2008–2009 పదవ తరగతి బ్యాచ్ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. 16 ఏళ్ల తర్వాత కలుసుకోవడంతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. విద్యాబుద్ధులు, ఆటలు నేర్పిన పీఈటీ ఎల్లంల కొమిరెల్లి, ఉపాధ్యాయులు మహ్మద్‌అలీ, పద్మజ, లక్ష్మి, వెంకట్‌రెడ్డి, సోమయ్యలను సన్మానించారు.

అధికారులపై దాడికి పాల్పడటం సరికాదు



నిరసన తెలుపుతున్న సంఘం నాయకులు

భానుపురి : ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమానికి వెళ్లిన వికారాబాద్ కలెక్టర్ జైన్, కొడంగల్ డెవలప్‌మెంట్ అథారిటీ డైరెక్టర్లపై దాడి హేయమైన చర్య అని, దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని సూర్యాపేట జిల్లా టీజీఓ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు భూపాల్ రెడ్డి, భూక్య పాండునాయక్ అన్నారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల కేంద్ర సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాసరావు, సత్యనారాయణ పిలుపు మేరకు సూర్యాపేటలో సోమవారం జిల్లా టీజీఓ కార్యవర్గం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ నాగేందర్, ఉపాధ్యక్షులు మనోహర్ స్వప్న, డాక్టర్ బి.రమేష్, కే.జగదీశ్వర్‌రెడ్డి, స్వప్న, జాయింట్ సెక్రటరీ చల్లా రాంబాబు, పద్మావతి, కోశాధికారి రవికుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ యాదగిరి, పబ్లిక్ సెక్రటరీ వెంకటేశ్వరరావు, ఆఫీస్ సెక్రటరీ జగదీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం మహాసభల కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాగార్జునరెడ్డి

భానుపురి : జిల్లా కేంద్రంలో ఈ నెల 29, 30, వచ్చే నెల 1న నిర్వహించనున్న సీపీఎం జిల్లా తృతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి కోరారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా మహాసభల కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. నవంబర్ 29న సూర్యాపేట జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్‌లో వేలాది మందితో బహిరంగ సభ జరుగుతుందన్నారు. సభకు పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారత్, బీవీ రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తదితరులు హాజరుకానున్నారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, వేల్పుల వెంకన్న, వీరబోయిన రవి, చిన్నపంగా నరసయ్య, జ్యోతి, రాంబాబు, వల్లపుదాసు సాయికుమార్, చెరుకు సత్యం పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన



జాజిరెడ్డిగూడెంలోని కేంద్రంలో ధాన్యంలోని తేమ శాతాన్ని పరిశీలిస్తున్న ఏఈఓ శోభారాణి

అర్వపల్లి : రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి, శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తేవాలని జాజిరెడ్డిగూడెం క్లస్టర్ ఏఈఓ శోభారాణి కోరారు. సోమవారం జాజిరెడ్డిగూడెంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించారు. 17 శాతం వరకు తేమ ఉండేలా చూసుకొని ధాన్యాన్ని తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు మాదగాని సుదర్శన్, శిగ పిచ్చయ్య, హామాలీలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని ముకుందాపురం, జి.కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ అమీన్‌సింగ్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకోచ్చి ప్రభుత్వం అందించే మద్దతు ధర పొందాలన్నారు. కొనుగోలు ప్రక్రియలో ఆలస్యం చేయొద్దని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం మైసయ్య, వీబీకేలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

తుంగతుర్తి : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధరను పొందాలన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్లు, డైరెక్టర్లు భిక్షంరెడ్డి, మజీద్, రవీందర్‌రెడ్డి, రామచంద్రు, యాకయ్య, నాయకులు రారగాని వెంకటయ్య, మల్లేష్, లింగయ్య, యాదగిరి, ఉమేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేతో కాసర్లపహాడ్ కాంగ్రెస్ నాయకులు



హైదరాబాద్‌లో మహేశ్వరికి ఆర్థికసాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సోమవారం గ్రామ ఎస్సీ సెల్ నాయకులు ఎమ్మెల్యే మందుల సామేల్‌ను కలిసి విన్నవించారు. గ్రామంలోని కేటాయించిన స్థలంలో ఎస్సీ గురుకుల పాఠశాల భవనాన్ని నిర్మించాలని కోరారు. అలాగే గ్రామంలో కమ్యూనిటీ హాల్, లింక్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ గ్రామ అధ్యక్షుడు వద్దిగల సత్తయ్య, చెరుకు భిక్షం, వద్దిగల బన్ని, మంచాల బక్కులు, జిల్లా శ్రీరాములు, బందెల వెంకన్న, శ్రీను, ఓగోటి లింగయ్య, వెంకన్న, భిక్షం, నర్సయ్య పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థినికి ఎమ్మెల్యే ఆర్థికసాయం

తుంగతుర్తి : మండల పరిధిలోని వెంపటి గ్రామానికి చెందిన నిరుపేద విద్యార్థిని కొండగడ్డుల మహేశ్వరి ఎంసెట్ పరీక్ష రాసి హైదరాబాద్‌లోని హార్టికల్చర్ కళాశాలలో సీటు సాధించింది. కానీ కాలేజీలో హాస్టల్ ఫీజు, సెమిస్టర్ ఫీజులు కట్టలేని స్థితిలో ఉంది. దీనికి తోడుగా ఆమె తండ్రి పెరాలసిస్ బాధితుడు కావడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితిని కాంగ్రెస్ పార్టీ మండల నాయకురాలు దాయం ఝాన్సీరాజిరెడ్డి ఎమ్మెల్యే సామేల్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే స్పందించి విద్యార్థిని ఉన్నత చదువుల కోసం సోమవారం హైదరాబాద్‌లో రూ.1లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చింతకుంట్ల వెంకన్న, సగ్గం నర్సయ్య పాల్గొన్నారు.

ప్యూరిఫైడ్ వాటర్‌ను సద్వినియోగం చేసుకోవాలి

నాగారం : విద్యార్థులు ప్యూరిఫైడ్ వాటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ వాసం ప్రభాకర్ అన్నారు. మండల పరిధిలోని ఈటూరు ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన బుక్క శ్రీనివాస్ ఉచితంగా ప్యూరిఫైడ్ వాటర్ సౌకర్యం కల్పించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ దాతను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఇంగ్లిష్ పదజాలంపై క్విజ్



క్విజ్ పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఆత్మకూర్(ఎస్) : ఆత్మకూరు మండల పరిధిలోని ఏపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సోమవారం ఇంగ్లిష్ పదజాలంపై క్విజ్ నిర్వహించారు. అన్ని తరగతుల విద్యార్థులను ఆరు గ్రూపులుగా చేసి క్విజ్ పోటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం బాసిత్ మాట్లాడుతూ విజేతలకు బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు పబ్బతి వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు విజయ్ కుమార్, రమణ, వేణు, పుష్పకుమారి, రవి, వెంకటేష్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగారెడ్డికి ఘన నివాళి

అర్వపల్లి : పేదల సంక్షేమం కోసం తపిస్తూ ప్రజా ఉద్యమాలు చేపట్టిన లింగారెడ్డి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య కోరారు. మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో ఆదివారం రాత్రి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు ఏమిరెడ్డి లింగారెడ్డి 8వ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి స్థూపం వద్ద కొవ్వొత్తులతో నివాళులర్పించి, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్, నర్ర మల్లేష్, చామకూరి మల్లేష్, బెల్లి మల్లయ్య, యాదయ్య, గాబ్రియేల్, నాగయ్య, లక్ష్మయ్య, ముత్తయ్య, శ్రీకాంత్, హరీష్, సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కార్తీక సోమవారం పూజలు

సూర్యాపేట : కార్తీక సోమవారం పురస్కరించుకొని కాంగ్రెస్ జిల్లా నాయకుడు గట్టు శ్రీనివాస్ సోమవారం పిల్లలమర్రిలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట సత్యనారాయణ, పద్మ, ప్రవీణ్, వెంకన్న, ఉదయ్ ఉన్నారు.

అర్వపల్లి : కార్తీక సోమవారంను పురస్కరించుకొని అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో దీపోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపం వెలిగించారు. అలాగే నక్షత్రహారతి కార్యక్రమం జరిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సహస్ర నామార్చన, విశేషార్చనలు జరిపారు. మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అర్వపల్లి రాంబాబుఅయ్యంగార్, పవన్ కుమార్, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

మాలధారుల పూజలు

అర్వపల్లి : తిమ్మాపురంలోని సూర్యక్షేత్రాన్ని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడతో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన అయ్యప్పస్వామి, హనుమాన్, గోవింద, శివ మాలధారులు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా క్షేత్రంలో పూజలు చేశారు. కార్యసిద్ధి వీరహనుమాన్, శ్రీరామకోటి స్థూపాలను కూడా దర్శించుకున్నారు. కార్యక్రమంలో క్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, గణపురం నరేష్, ఇంద్రారెడ్డి, అర్చకులు బీంపాండే, శ్రీరాంపాండే, అంకిత్‌పాండే పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అర్వపల్లి : మండల పరిధిలోని కోడూరు గ్రామంలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి అర్జున్ కోరారు. వీఎల్‌ఓ కేఎస్ఎస్. పద్మ, ఓఎస్ మధుసూదన్, యాకయ్య, గోపాలమిత్రలు లింగయ్య, అర్జున్ పాల్గొన్నారు.